# దీపావళి కథల పోటీలో రూ.500 బహుమతి పొందిన కథ!

మోకాలి మీద రెండు చేతులు ఆన్చి, వాటి మీద తల ఉంచి ఆలోచిస్తోంది 'గౌరి' ఆ అమ్మాయికి పది సంవత్సరాలుంటాయి.

"గౌరీ నాతో వస్తావా" అంటూ వచ్చింది గీత.

"ఎక్కడికి?" తలపైకెత్తి అడిగింది గౌరి.

"భజనకి. మరేమో రోజూ నువ్వు నాతో భజనకి రావాలి. కొద్దిరోజుల్లో పోటీలు కూడా పెడుతున్నారంట." అంది గీత.

"ఏం పోటీలు గీతా?" అంది గౌరి.

"మన దేవుళ్ళ గురించి మాట్లాడాలంట. రాముడూ, కృష్ణుడూ, సీత వాళ్ళగురించి. వస్తావా?"

"అమ్మతో చెప్పి వస్తాలే"

"తప్పకుండా రావాలి. పోటీలో చేర్చుకోవాలంటే రోజూ భజనకు రావాలి. అప్పుడే మన పేరు రాసుకుంటారు. ఈ పోటీకి చాలామంది వస్తారంట. బహుమతి వస్తే డబ్బులిస్తారంట" చెప్పింది గీత.

"డబ్బులా! నిజంగానా?!" ఆశ్చర్యంగా అడిగింది గౌరి.

"అవును"

"ఎంత?"

"వందరూపాయలు"

"వందరూపాయలే"—నోరు తెరిచింది గుండెల మీద చేతులు వేసుకొని.

* * *

గౌరి భజన చేస్తోంది.

రెండు చేతులూ అసంకల్పితంగా కలుసుకుంటున్నాయి. గౌరి నోటినుండి ఆ భక్తిగీతం ఇతర కంఠాల్ని కలుపుకొని మారుమ్రోగుతోంది. గౌరి కళ్ళముందు అమ్మ నిలిచింది!

ఆ రోజు, అప్పుడే చీకటిపడుతూంది. ఇంట్లో నడుస్తున్న అమ్మ పాలచెంబును తన్నేసింది. తమ కళ్ళముందే తెల్లటి ఆ పాలు ఆ గదిలో ఆ మట్టిలో ఇంకిపోతున్నాయి. నిస్సహాయంగా తామంతా చూస్తూనే ఉన్నారు. అమ్మ బాధపడ్తూ అంది అన్నయ్యతో...


"కళ్ళు కనిపించటం లేదురా. డాక్టర్‌కి చూపించి కళ్ళజోడు కొనుక్కోవాలి."

రెండు సంవత్సరాల నుండీ ఈ మాట అమ్మ అప్పుడప్పుడూ చెబుతూనే ఉంది. ఈలోపు అనేకసార్లు పడబోయింది.

రాత్రిపూట చీకట్లో తడువుకుంటూ నడుస్తుంది. పగలు అంత ఇబ్బంది ఉండదు. అయితే పుస్తకాలు చదవాలంటే బాగా దగ్గరకు తెచ్చుకొని కళ్ళు చిట్లించి చూస్తుంది. వెంటనే కంటి డాక్టర్‌కు చూపించుకొమ్మని చాలామంది చెబుతున్నారు.

ఆలస్యం చేసిన కొద్దీ కళ్ళు మరింత దెబ్బతింటాయట. అప్పుడేమో మందపాటి కళ్ళద్దాలు పెట్టుకోవాలంట. అసలు అమ్మ కళ్ళు దెబ్బతింటాయంటేనే ఎంతో బాధ కలుగుతుంది. అమ్మ కళ్ళని చూస్తుంటే ఏడుపొస్తుంది.

తనకింకా బాగాగుర్తు. నాన్న చనిపోయినప్పుడు అక్కనూ, తముడ్నీ, తనను వాటేసుకొని అమ్మ ఏడుస్తుంటే అన్నయ్య దూరంగా నిలబడి ఏడ్చాడు.



అప్పుడు అమ్మ కళ్ళవెంట ఎన్నినీళ్ళు కారిపోయాయో! అప్పుడు అమ్మ బుగ్గలు తడిసాయి. చీర కొంగు తడిసిపోయింది. అమ్మ తమని గుండెల కదుముకున్నప్పుడు తమ తలలమీద, చేతులమీద అమ్మ కన్నీళ్ళే కురిసాయి.

ఆ కళ్ళలో వెలుగు ఆరిపోవటం అదే మొదలు అప్పటి నుండే ఆ కళ్ళలోకి చీకట్లు ప్రవేశించాయి.

ఎప్పుడు ఆ కళ్ళు చూసినా ఆ దృశ్యం గుర్తొస్తుంది అమ్మ కళ్ళలో ఏదో భయం కనిపిస్తుంది. చాలాసార్లు అంది.

"మిమ్మల్ని పెద్దవాళ్ళని చేస్తే ఈ జీవితానికి అదిచాలు" అమ్మ కళ్ళు దెబ్బతింటున్నాయనే విషయం ఇంట్లో అందరికీ తెలుస్తూనే ఉంది.

తన శరీరం మీద ఎప్పుడూ రెండు గౌన్లు మాత్రమే ఉంటాయి. అవి చిరిగిపోయినా కుడుతూనే ఉంటుంది. అక్కకూ, తమ్ముడికీ అంతే. అన్నయ్యకు మాత్రం బయటకు వెళ్తాడు కాబట్టి మరో జత ఉంటుంది. అందుకే ఎప్పుడు కళ్ళజోడు కొనాలన్నా ఏదో అవసరం వస్తూనే ఉంది. ఇంతవరకూ కుదరలేదు.

మొన్న వరసగా రెండు రోజులు పక్కింటి ఆంటీకి వరసగా తలనొప్పి వచ్చింది. అప్పుడు అంకుల్ ఎంత కంగారుపడిపోయారో. రిక్షా తీసుకు వచ్చి హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. తిరిగి ఇంటిముందు రిక్షా ఆగగానే బుట్టనిండా బత్తాయిలు, ఏపిల్స్, అంకుల్ వెనకగా సిగ్గుపడ్తూ నడిచివచ్చింది ఆంటీ... ఎందుకో కొత్తగా అనిపించింది. తీరాచూస్తే... ఆంటీ కళ్ళజోడు పెట్టుకున్నారు.

ఆ కళ్ళజోడు బంగారంలా మెరిసిపోతూంది!

తలనొప్పిరాకుండా పెట్టుకుంటారంట దాన్ని!!

ఇంకా బలం రావటం కోసం గ్లూకోజు, పళ్ళూ,

# హుమతి

— సంధ్యాలక్ష్మణ్



మానం తీసుకోవాలంట.

నిజంగా అప్పుడే గనక డబ్బులుంటే మొత్తం కళ్ళజో డంతా బంగారంతో చేయించి అమ్మ కళ్ళకు పెట్టాలని పించింది. అమ్మ చేతిని పట్టుకుంటే ఉలిక్కిపడి నవ్వింది. అప్పుడు ఆ కళ్ళ నుండీ నీళ్ళురాలేదు గానీ... ఎందుకో ఆ కళ్ళనిండా మేఘాలున్నట్లే అని పించింది.

రాత్రిపడుకున్నప్పుడు...

"అమ్మా కళ్ళజోడు లేకపోతే నీ కళ్ళుపోతాయా?" అనడిగితే—

"లేదమ్మా. నాకేంకాదు. మీరంతా పెద్దయ్యేదాకా ఈ కళ్ళుపోవు. మీరంతా పెద్దయ్యాక నా కళ్ళుపోయినా ఫర్వాలేదు. మీరందరూ ప్రపంచంలో ఏం జరుగు తుందో మీ కళ్ళతో చూసి ఈ అమ్మకు చెప్పరూ" అంటున్నప్పుడు...

అమ్మ హృదయంలో తలదాచుకుంటుంటే తనకు ఎంత ఏడుపొచ్చిందనీ! తన తల నిమురుతున్న అమ్మ "ఎందుకమ్మా ఏడుస్తున్నావు" అంటూ నన్ను గుండెలక దుముకొని తనూ ఏడవలేదూ!

ఆ రోజు రాత్రి కలలో అమ్మ రెండు కళ్ళూపోయినట్లు, అమ్మమీద ఎవరో పిల్లలు రాళ్ళువేస్తున్నట్లూ, అమ్మ శరీరంనుండి రక్తంధారలుగా కారుతున్నట్టు చూసి... బిగ్గరగా అరిచి తనులేస్తే...

గదంతా చీకటి. మరి అమ్మకు రేపంతా చీకటేనా? దేవుడూ! మా అమ్మ కళ్ళు తీసుకోవద్దు దేవుడూ నేనూ రోజూ బడికి వెళ్తున్నప్పుడు ఎప్పుడైనా దారిలో డబ్బులు దొరికితే ఎంత బాగుంటుంది! అమ్మకు కళ్ళజో డు కొనొచ్చు. అయినా ఎప్పుడూ ఒక్క రూపాయన్నా దొరకదు.

అసలు నాన్న చనిపోయాక ఒక్కరంటే ఒక్కరు వచ్చారా? తమ చుట్టాల్లో ఎంతమంది పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారో! ఎంతమందికి బోలెడు పొలాలున్నాయో! ఇళ్ళున్నాయో! ఎవరూరారు. అందరికీ భయం. నాన్నగా రున్నప్పుడు చాలామంది వచ్చేవారు. ఇప్పుడు ఎవరూ రారు.

ఎవరన్నా వస్తే "అమ్మ కళ్ళు పోతున్నాయి" అని అరిచి చెప్పాలనుంది.

అమ్మ అలా చెప్పనివ్వదు. అసలు ఇంట్లో తింటు న్నామో లేదో కూడా పక్కింటివారికి తెలియదు. అందుకే కాబోలు వారంతా అనుకుంటారు. "అమ్మో ఆవిడకి ఎంత అభిమానమో" మరందుకే ఈ చుట్టాలు ఎవరూ రారు.

ఆ తర్వాత వచ్చినా ఉపయోగం ఉండదు.

అప్పుడు అమ్మకు కళ్ళుండవుగా. ఎవరొచ్చినా చూడ లేదు.

ఎవరో గిల్లినట్లు అనిపించింది. ఈ లోకంలో పడింది. గీత "ష్... ష్..." అనరిస్తే భజన ఆపింది.

"ఈ పాపెవరో బాగా లీనమైపోయిందే" పాటలు నేర్పుతున్న ఆ యువతి అంది. ఆమె మొఖంలో ప్రశాంతత గోచరిస్తుంది. ఆమె నుదుట విభూది పెట్టు కుంది.

"చూడండి పిల్లలూ, రేపు ఆదివారంనాడు మీ అందరికీ పోటీలు జరుపుతున్నారు. పది సంవత్సరాల లోపు వారంతా ఓ గ్రూపు. మీరు చేయాల్సిందేమిటంటే "హరిశ్చంద్రుడు" "కౌశికుడు", "శిబిచక్రవర్తి" ఈ ముగ్గురిలో ఎవరో ఒకరి గురించి మాట్లాడాలి. మీరు ఈ రోజూ రేపూ బాగా చదువుకోండి. ఇక్కడకు నాలుగు మైళ్ళదూరంలో ఉన్న గ్రామంలో పోటీలు జరిగినా బస్ ఉంది కాబట్టి మీరు రావచ్చు. ఉదయం పది గంటలకే పోటీ మొదలవుతుంది. ఈ పోటీలో ఓ ప్రార్థనా గీతం పాడాలి. మీ పుస్తకాల్లో ఏదో ఒక పద్యమైనా ఫర్వాలేదు. మీలో ఎవరెవరొస్తున్నారో లేచి నిలబడండి."

నలుగురు నిలబడ్డారు. అప్పుడామె అడిగింది.

"నీ పేరేంటమ్మా?"

"గౌరి"

* * *

అందరూ నిద్రపోతున్నారు. గౌరికి ఎంతకీ నిద్రరావటంలేదు.

అవును. ఎవరి గురించి మాట్లాడాలి? ముగ్గురి గురించీ తనకి బాగా తెలుసు. చాలా పద్యాలు కూడావ చ్చు. మరి ఎవరి గురించి మాట్లాడితే బహుమతి వస్తుంది? ఏదో ఒక బహుమతి కాదు. మొదటి బహుమతి రావాలి. అప్పుడే అమ్మకు కళ్ళజోడు కొనొ చ్చు. ఇంకా డబ్బులు కూడా మిగులుతాయి. అప్పుడు తను ఓ మంచి గౌను కొనుక్కుంటే... మరి తమ్ముడికో? అక్కకూ లేవుగా! ఏమోలే ముందు బహుమతిరావాలిగా!

గౌరి కళ్ళు మెల్లగా మూతలు పడుతున్నాయి. అప్పుడు నిద్రలో... గాలిలో తేలిపోతున్న ఇద్దరు వ్యక్తు లు కనిపించారు.

ఎవరామె?! అమ్మ కదూ... అరె! అమ్మే! ఎంత బాగుందో! అమ్మ భలే చీర కట్టుకుంది. అమ్మ కళ్ళు అద్దాల వెనక మెరుస్తున్నాయి. అమ్మ కళ్ళజోడు పెట్టు కుంది. ఆ కళ్ళజోడు మెరుస్తూంది.

వెన్నెల్లో అమ్మతో పాటు తెల్లటి గౌనులో తనే! అమ్మో... గాల్లో ఎగురుతూ వస్తున్నామే... అమ్మకు తనే పుస్తకం అందించింది. దూరంగా ఉంచుకునే చదువుతుంది. బిగ్గరగా... సంతోషంగా... అమ్మకేసి అలానే చూస్తుండా లనిపిస్తూంది... అమ్మ తలెత్తి చూసి నవ్వినప్పుడు వెన్నెల వెలుగు కళ్ళజోడు ఫ్రేమ్ మీదపడి జిగేల్ మంది... ఎవరో వస్తున్నారే... ఎవరు?!

"ఏవమ్మో భలే అద్దాలు కొన్నావే"

"నేను కొనలేదండి. మా గౌరి కొనిపెట్టింది."

"ఆ అమ్మాయికి డబ్బులెక్కడున్నాయి?"

"నా బంగారు తల్లికి వందరూపాయల బహుమతి వచ్చింది."

అమ్మ కళ్ళలో మెరుపులు... మెరుపులు.

గౌరి ఉలిక్కి పడిలేచింది. ఎక్కడో కోడి కూసినట్లని పించింది.

"అమ్మో... తెల్లారిపోతూంది" అనుకుంటూ లేచింది.

"ముందు మొఖం కడుక్కోవాలి" అని ముందుకు నడిచింది.

"అమ్మో" అరిచింది అక్క.

గౌరి నాలిక కరుచుకుంది.

"ఏమే... అప్పుడే తెల్లారిందనుకున్నావా... చూసినడ వలేవూ... ఇంకా నయం గొంతుమీద కాలెయ్యలా."

గౌరి మాట్లాడలేదు. తిరిగిపడుకుంది. రాత్రిపూట చిన్నవత్తిచేసి బుడ్డి ఉంచుతారు. కిరసనాయిలు అయిపోయి ఉంటుంది. బలవంతంగా నిద్రపోవాలని. ప్రయత్నం చేసింది. ఉహు... రావటంలేదు. అలానే చీకటిని చూస్తూ పడుకొంది. మదిలో శిబి చక్రవర్తి, కౌశికుడూ, హరిశ్చంద్రుడూ, అమ్మా, కళ్ళజోడూ... గిర్రున తిరుగుతున్నారు.

ఆ చీకట్లను చీల్చుకుంటూ ఓ వెలుతురు కిరణం ఆ ఇంట్లోకి ప్రవేశించింది. క్రమంగా ఎవరెవరో లేస్తున్న సవ్వడి... గౌరి ఈసారి జాగ్రత్తగా చూసుకుంటూ బయటకు నడిచింది. కచ్చిక నలుపుకొని పళ్ళు తోము తుంటే అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడు!

ఆ దృశ్యం చూస్తూ వుండిపోయింది కొంతసేపు.

* * *

గౌరి గబగబ అడుగులేస్తూంది. ఇంకా

ఎవరి గురించి మాట్లాడాలో నిర్ణయించుకోలేకపోయింది. తను స్నానం చేసిందే గానీ, చెమటలు బట్టల్ని కూడా తడిపేస్తున్నాయి. కాళ్ళకూ చెప్పులు లేవు. గౌను కూడా పాతదే. తలకు నూనె రాయలేదు. నీళ్ళురాసి దువ్వుకొంది. తను పోటీలో పాల్గొనాలి. బహుమతి సాధించాలి.

అందరూ ఈ వేళకు బస్‌లో చేరి ఉంటారు. అమ్మ దగ్గర అసలు డబ్బులు లేవు. నాలుగు మైళ్ళదూరం తనకు పెద్ద దూరంకాదు. పొలాలకు అడ్డంపడి వెళ్తే ఇంకా దగ్గరవుతుంది. దూరంగా ఉన్న ఆ గ్రామంలో జమీందారుగారు ఉండేవారట. అక్కడ పెట్టారు పోటీలు.

గౌరి పొలం గట్లమీద నుండి వడివడిగా అడుగులేస్తూంది. ఎవర్నయినా అడిగితే తనను తీసుకువెళ్ళేవారేమో. కానీ అడగాలనిపించలేదు. అప్పుడే అందరూ అక్కడకి చేరారేమో.

గౌరి పొలాలనుండి ఓ కాలువ మీదున్న వంతెన మీదకు చేరింది. అక్కడనుండి ఉన్న అడ్డరోడ్డు మీదకు అడుగుపెట్టింది. దారి కిరువైపులా పంటకాలువల్లో నీళ్ళుపారుతున్నాయి. చెట్లుగాలికి రెపరెపలాడుతున్నాయి. పొలాల్లో జనం పని చేసుకుంటున్నారు. ఒక్కసారి నిలబడి కాలవనీ, చెట్లనీ, పొలాల మీద ఎగురుతున్న పక్షుల్ని చూసింది.

సూర్యుడు చురుక్ మనిపించాడు. ఉలిక్కిపడి వేగంగా నడవటం ప్రారంభించింది. దూరంగా జమిందారు గారి కోట తాలూకు ద్వారం కనిపించింది. అప్పుడు పరుగెత్తింది గౌరి. కొంచెం సేపు ద్వారం దగ్గర నిలబడి చూసింది. నల్లగా ఉంది. సున్నం పెచ్చులూడిపోయి, పాకుడు బట్టి కనిపిస్తూంది. అయినా అందంగానే ఉందనిపించింది. రెండు సింహం బొమ్మలు ఆ ద్వారం మీద గంభీరంగా ఉన్నాయి—పాతబడ్డా.

మొఖమంతా చెమట... గౌను తడిసిపోయింది. గౌరికి సిగ్గువేసింది. వేలితోనే చెమట చుక్కల్ని గాలిలోకి విసిరింది. మరికొంతదూరం నడిచాక కనిపించిందా దృశ్యం.... చాలామంది పిల్లలు... కొంతమంది పెద్దలు కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. వారి చేతిలో కాయితాలున్నాయి.

గౌరి భయంగా అక్కడికెళ్ళింది.

"కూర్చోమ్మా" అన్నారు. గౌరి కూర్చుంది.

దాదాపు రెండువందలమంది దాకా ఉండొచ్చునేమో అనుకుంది గౌరి. ఇంతమందిలో తనకు బహుమతి వస్తుందా అనే అనుమానం మెల్లగా ప్రవేశించింది. ఒక్కొక్కరే వస్తున్నారు. పద్యం చదువుతున్నారు. తర్వాత కథ చెబుతున్నారు. రెండు నిముషాలవగానే బెల్లు మోగుతుంది. వారిని పంపిస్తున్నారు.

గౌరికి ఓ విషయం స్పష్టమైంది సమయం చాలా తక్కువ. సంబోధనలతోనే అరనిముషం అయిపోతుంది. కథ చెప్పటం మొదలుపెడితే ఓ ఘట్టం కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు. అందరూ ఆ తప్పే చేస్తున్నారు.

దాదాపు పిల్లలందరూ అయిపోతున్నట్లున్నారు. తనపేరు రావటంలేదు. గౌరికి అప్పుడు భయం పట్టుకొంది. చుట్టూ చూసింది కంగారుగా, తమకు భక్తిగీతాలు నేర్పిన యువతి కనపడింది. భయం భయంగానే లేచి వెళ్ళింది.

"ఓ వచ్చావా?" అందామె నవ్వుతూ

"నాపేరు రాలేదు" అంది గౌరి.

"ఇక్కడకొచ్చాక రాసుకున్నారు. ఉండు నీపేరు రాయిస్తాను" అని అక్కడున్న వారికి చెప్పింది. చివరి వ్యక్తి గౌరి!

అంతకుముందు రెండుసార్లు బడిలో మాట్లాడినా ఇంతమంది ముందు మాట్లాడాలంటే భయంగా ఉంది.

అప్పుడు అమ్మ కళ్ళు గుర్తొచ్చాయి.

ఆ క్షణమే ఎవరి గురించి మాట్లాడాలో నిర్ణయమూ జరిగింది.

గీత కళ్ళకు పంటకాలవ... ఎగురుతున్న పక్షులు మాత్రమే కనిపిస్తున్నాయి. ఆ లేత కంఠంనుండి ఊపిరి పోసుకుందో పద్యం... అంతా నిశ్శబ్దం... గౌరి కంఠం వినబడుతూంది.

"ఇక్కడ పెద్దలందరికీ నమస్కారం. నేను సత్యహరిశ్చంద్రుడి గురించి మాట్లాడాలనుకుంటున్నాను. నిజం చెప్పటం కోసం ఆయన ఎన్ని కష్టాలననుభవించారో, మన మహాత్ముడు గాంధీజీలాంటి నాయకులకు ఎందుకు ఆదర్శం అయ్యారో రెండు మూడు సంఘటనల ద్వారా చెబుతాను."

"బాగా చెప్పావమ్మాయ్" అన్నారొకాయన సంతోషం ఆపుకోలేక.

తన రాజ్యం కోల్పోవటం, తన బిడ్డ చనిపోవటం, తన భార్య మెడలోని తాళిని అమ్మమనటంలాంటి సంఘటనలు చెప్పింది గౌరి. అక్కడి పెద్దలు సంతోషంతో పొంగిపోయారు. ఇంకా సమయం ఉండగానే,

"చాలమ్మా... చాలు... బాగా చెప్పావు" అన్నారు, శరీరంలోని ప్రతి అణువూ తీవ్ర ప్రకంపనలకు లోనవుతుండగా గౌరి వచ్చికూర్చుంది.

అక్కడున్న వారందరికీ ఓ విషయం స్పష్టమైంది. గౌరికి బహుమతి వచ్చితీరుతుంది. గీత వచ్చి ఆప్యాయంగా గౌరి చేతులు పట్టుకొంది.

"ఇంతటితో పోటీ ముగిసింది. ఫలితాలు రేపు ప్రకటిస్తాం. బహుమతుల్ని ఓ సభ జరిపి ఇస్తాం" అని ఒకాయన చెప్పడం జరిగింది.

పిల్లలంతా లేచారు. గౌరి నడుస్తూంది. పొలాలన్నీ ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు అలసట అనిపించటంలేదు. ఎంత త్వరగా ఇంటి కొచ్చిందో తెలియదు. అమ్మ దగ్గరకి పరిగెత్తుకెళ్ళి ఒక్కసారిగా చుట్టుకుపోయింది.

"వచ్చావా... బాగా చెప్పావా?"

తలూపింది గౌరి.

"మరి నీకు బహుమతొచ్చిందా?"

"రేపు చెబుతారంట"

* * *

గీత గలగల మాట్లాడేస్తూంది.

"నాకు చాలా బాధగా ఉంది గౌరీ. నీకు తప్పకుండా మొదటి బహుమతి ఇవ్వాలి. అక్కడ ఎవరినడిగినా అదే చెబుతారు. కానీ నువ్వు రోజూ భజనకు రావు కదా. అందుకని ఇవ్వలేదంట. మావాళ్ళు అనుకుంటున్నారు. కొంతమంది నాకంటే ఆ అమ్మాయే పద్యం బాగా చెప్పిందంటున్నారు. అదంతా అబద్ధం. వాళ్ళలో వారికి చ్చుకోవాలని ఇలా చేశారు.

గౌరి సంతోషంలో సగభాగం ఎగిరిపోయింది.

"ఇంతకూ రెండో బహుమతికి ఎంతిస్తారు గీతా"

"ఏభై రూపాయలు అనుకుంటాను" అంది గీత.

"అలాగా" అంది ఆలోచిస్తూ గౌరి.

"మొత్తానికి సాధించావే. థ్యాంక్స్" అంది గీత.

"నేనే చెప్పాలి. మరి... ఎప్పుడిస్తారు" సిగ్గుపడ్తూ అంది గౌరి.

"ఇంకో పదిరోజుల్లో సభ జరుగుతుంది. అప్పుడు ఇస్తారు" చెప్పి వెళ్ళిపోయింది గీత.

గౌరి ప్రక్కన ఆంటీ దగ్గరకు వెళ్ళింది. ఆమె "కళ్ళజోడు"కు చెందిన వివరాలు ఎన్నో చెప్పింది.

"కళ్ళజోడు అంటే అందులో అద్దాలు పెద్ద ఖరీదు కాదు. ఫ్రేమ్‌ను బట్టి ధర ఉంటుంది. బాగా డబ్బున్న వారయితే ఖరీదైన ఫ్రేమ్‌లో అద్దాలు బిగించుకుంటారు. ఇంకా బాగా డబ్బుంటే బంగారంతోనే చేయించుకోవచ్చు. బంగారమయినా అవే అద్దాలు. ఏభైరూపాయలకా... ఎందుకురాదు. తప్పకుండా వస్తుంది. ఫ్రేమ్ అంతబాగుండదేమో. అయితే ఏం కళ్ళు బాగాకనపడతాయి. నేననుకోవటం నలభైరూపాయలకే రావచ్చు."

గౌరి హృదయం పులకరించింది. తను కలలుగన్న దృశ్యం వాస్తవం కాబోతుంది. రాత్రిపడుకోబోతూ గౌరి అమ్మతో అంది...

"అమ్మా పదిరోజుల్లో నీకు కళ్ళజోడు వస్తుంది. నా బహుమతి డబ్బుల్తో నీకు కళ్ళజోడు కొనుక్కుందాం.

అప్పుడు ఆ తల్లికి కలిగిన ఉద్వేగ ప్రకంపనాలు చాలాసేపు నిద్రకు దూరం చేశాయి. ఓ వెచ్చటి కన్నీటి బొట్టు ఆమె బుగ్గల మీద జారింది.

* * *

"గౌరీ, ఇంకొంచెం సేపట్లో బహుమతులిస్తున్నారంట" గీత వచ్చి చెప్పింది.

"ఎక్కడ? అక్కడేనా?"

"అవును. వారంతా వ్యాన్‌లో వెళ్ళారు."

"మరి మనం"

"బస్‌లో వెళ్దాం"

"బస్‌లోనా కాదులే. నేను నడిచివస్తాను"

"దూరం కదా"

"దూరమేంకాదు. అయినా బస్‌లో మీరు వచ్చేలోపు నేను వస్తాగా" అంటూనే అమ్మకు చెప్పటానికి లోనకెళ్ళింది.

గౌరి పొలాల కడ్డంగా లేడిలా పరిగెడుతూంది. పొలంలో పని చేసుకుంటున్న వారు తలెత్తి వింతగా చూస్తున్నారు. పొలాలు దాటిపోయాయి. వంతెన రెండంగల్లో దాటింది. పంటకాలువలు... చెట్లు... జమీందారుగారి గేట... లోపల ఓ బల్లముందు నిలబెట్టిన మైకు చూసి ఆగింది రొప్పుతూ...

అరగంటతర్వాత సభ ఆరంభమైంది. ఎవరెవరో మాట్లాడారు. ఎదురు చూసిన క్షణం ఆరంభమైంది. బహుమతి ప్రదానోత్సవం మొదటి బహుమతి వచ్చిన పాపపేరు చదివారు. గౌరి ఉద్వేగంతో చూస్తూంది. ఓ కవర్‌తోపాటు కొన్ని పుస్తకాలు అందించారు. •

"రెండో బహుమతి గౌరి"

గౌరి నడుస్తూంది... కళ్ళలో సంతోషం... సిగ్గు... రకరకాల భావనలు...

"రెండో బహుమతిగా ఏభైరూపాయలు. ఇరవై అయిదురూపాయలు నగదుగా ఇస్తున్నాం. మిగతావి పుస్తకాల రూపంలో ఇస్తున్నాం. చూడమ్మా వీటిని తలక్రింద పెట్టుకు పడుకోవటానికి కాదు ఇస్తుంది. రామాయణ, భారత గ్రంధాలు చదివి ఉన్నత వ్యక్తిత్వం అలవరుచుకుంటారని."

గౌరి మొఖంలో సంతోషమంతా ఆవిరైపోయింది. తన వెనక వార్తధ్వానాలు... గీత బిగ్గరగా చప్పట్లు కొడుతూంది. గౌరికి అవేం వినిపించటంలేదు. మోయలేని పుస్తకాల బరువు! యాంత్రికంగా కవర్ అందుకుంది. ఎవరో సాయం చేశారు. గీత పుస్తకాలు అందుకొని గబగబ తిరగేస్తూంది.

గౌరికి అమ్మ గుర్తొచ్చింది.

ఒక్కసారి నిలబడి భోరున ఏడవాలనిపించింది.

గౌరి మొఖంకేసి ఎవరైనా చూస్తే వెంటనే కనిపెట్టవచ్చు. ఆ నిరాశని...బహుమతులు ఇవ్వటం అయిపోయింది

"గౌరీ... బస్ ఇప్పుడే రాదంట. మేమూ నడిచొస్తాం" అంది గీత.

పిల్లలంతా నడక ఆరంభించారు. 'మేం తెస్తాం' అంటూ తలో పుస్తకం అందుకున్నారు.

"ఏంటోయ్... అంత నీరసంగా ఉన్నావ్. ఇదే బహుమతి నాకొస్తే మా ఇంట్లో ఎంత హడావుడి. డబ్బులన్నీ నాకిచ్చి స్వీట్స్ పంచుకొమనేవారు. పుస్తకాలు వాళ్ళ ఫ్రెండ్స్‌కి చూపించి... ఎందుకులే."

"అసలు మా నాయనమ్మ అయితే ఈ రామాయణం నాకొచ్చిందని తెలిస్తే,ఇంకెందుకులే."

"రామాయణం పుస్తకం ఇవ్వటం పుణ్యంరా... గౌరి ఎందుకో పెద్ద ఉషారుగా లేదు."

గౌరికివేం వినపడటంలేదు. ఇప్పుడెలా? ఏం చేయాలి? కనీసం మరో పదిహేను రూపాయలు కావాలి. ఎవరిస్తారు? ఇదే మరో సందర్భంలో అయితే అంత లావు పుస్తకాలు వచ్చినందుకు తనకే సంతోషంగా ఉండేది! మరేమిటి చేయటం...

"పోనీ ఆంటీనడిగితే... అవును... అదే చేయాలి. ఈ పుస్తకాలు తీసుకొని ఇరవై అయిదురూపాయలు ఇమ్మనాలి. అయినా నాకెందుకంటుందేమో... అయితే ఓ పని చేయాలి... పదిహేను రూపాయలకు తీసుకోమంటాను... ఆంటీ సరేనంటారు... అవును నలభైరూపాయల్తో అమ్మకు కళ్ళజోడు కొంటాను... కొంటాను."

అప్పుడు గౌరి మొఖంలోకి కళవచ్చింది. గౌరిని చూస్తుంటే కొంతమందికి అసూయగా కూడా ఉంది. అందరూ ఇంటికొచ్చారు. వెళ్తూ అంది గీత...

"ఈ పుస్తకాలు బాగా చదువు. నువ్వింకా గొప్పదానివవుతావు."

అమ్మకళ్ళనిండా సంతోషం...

తన బిడ్డ విజయానికి అమె చుట్టు ప్రక్కల నుండి ఈసరికే ఎన్నో ప్రశంసలు లభించాయి. తన బిడ్డను చూసి అడిగింది.

"ఏమ్మా... అలా ఉన్నావే."

"ఇరవై అయిదురూపాయలే ఇచ్చారు. మిగతావి పుస్తకాలు"

"పోనీలే గౌరీ ఎంతోకొంత వచ్చిందిగా."

"మరివాటితో కళ్ళజోడు రాదుగా"

"అదా... కొనుక్కుందాం తల్లీ... దేనికయినా ఆ రోజు రావాలి."

"ఈ పుస్తకాలు అమ్మేసి కొనుక్కుందాం" అంది గౌరి.

"అమ్మా" పిల్చాడు అన్న అప్పుడే.

"వస్తానుండు" అంటూ వెళ్ళింది.

దాదాపు పావుగంటసేపు అమ్మ, అక్క, అన్న చర్చించుకోవటం వినపడుతూంది గౌరి పుస్తకాలకేసి చూస్తూంది.



లయనెస్

**యస్. పూర్ణిమ**

విశాఖపట్నం, లయనెస్‌క్లబ్ (నార్త్) విభాగానికి, సెక్రటరీగా వ్యవహరిస్తున్న శ్రీమతి యస్. పూర్ణిమ, ఇండోనేషియాలో పుట్టి, పెరిగారు.

విశాఖ వచ్చి స్థిరపడ్డాక, నార్త్ లయనెస్ క్లబ్‌లో చార్టర్డ్ మెంబరు అయ్యారు.

కష్టాలకడలిలో, దారీతెన్నూ తెలియక కొట్టుమిట్టాడుతున్న అభాగినులను ఆదుకునే తత్వం గల శ్రీమతి పూర్ణిమ, అచిరకాలంలోనే నార్త్ లయనెస్‌క్లబ్‌లో సెక్రటరీగా ఎన్నికోబడటం విశేషం.

—మల్లిడి సత్తిరెడ్డి

అమ్మవచ్చి గౌరిని దగ్గరకు తీసుకుంది.

కొంచెం సేపు మాట్లాడలేదు.

"చూడమ్మా గౌరీ... మనం అనుకున్నవన్నీ నెరవేరవు. ఇప్పుడు అక్కకు అర్జెంటుగా ఫీజు కట్టాలి. కళ్ళజోడును కొన్నాళ్ళు ఆపుకోవచ్చు. కానీ ఇది ఆగితే అక్క చదువు ఆగిపోతుంది. అందుకే అక్కకు ఫీజు కడదాం. ఇవిగో... అయిదు రూపాయలు... కొనుక్కో... మొత్తం ఖర్చుచేసుకో... నీ స్నేహితులకు చాక్లెట్లు కావాలంటే ఇవ్వు... ఫర్వాలేదు... మీరందరూ నాకళ్ళలాంటివారు. మీరు బాగా చదువుకొని పెద్దవారయితే చాలు. ఎన్ని కళ్ళజోళ్ళయినా కొంటారు. నేను మీకోసం బతుకుతున్నానమ్మా... మిమ్మల్ని చూసుకు బతుకు తున్నాను. ఇప్పుడు మీ ప్రేమ చూశాక ఎలాంటి కష్టాల్నయినా భరించగలననే నమ్మకం కలుగుతుంది... ధైర్యమొస్తుంది గౌరీ..." అమ్మ కంఠంలో క్రమంగా ఓ ఆవేదనా తరంగం... దుఃఖాన్ని మేళవించుకొని...

అమ్మ కళ్ళు తడుచుకుంది.

ఆ కళ్ళలో ఏవేవో వెలుగులు...

అవి దీనంగా లేవు...

గౌరి అరచేతిలో అయిదు కాయితం ఉంచి... పిడికిలి మూసింది... అమ్మ వెళ్ళిపోయింది...

గౌరి అలానే కూర్చుంది.

భోజనం చేయాలనిపించలేదు.

మంచమీద వాలిపోయింది. ఆలోచన... ఆలోచన... సాయంకాలం... ఆటలకు వెళ్ళలేదు... చీకట్లు ముసురుతున్నాయి... పిడికిలి తెరిచింది.

నలిగిపోయిన అయిదురూపాయల కాయితం... మెల్లగా లేచింది. చిల్లర దుకాణం వైపుకు గౌరి అడుగులు.

* * *

అందరూ పడుకొన్నారు...

బుడ్డీవత్తి తగ్గిస్తుంటే...

"అమ్మా" అనే పిలుపు.

ఎదురుగా గౌరి.

"ఏం తల్లీ"

"ఇవిగో డబ్బులు."

"ఏమీ కొనుక్కోలేదా"

"కొనుక్కున్నాను."

"ఏం కొన్నావ్... అన్నీ తిరిగి ఇచ్చావుగా."

"పావలాకి కొన్నానమ్మా... ఇదిగో ఇది!"

అమ్మ తలెత్తింది.

గౌరి చేతిలో...

రంగుల కాయితాలు అంటించిన కళ్ళజోడు!

ఆ తల్లి కళ్ళలో ఒక్కసారిగా కదిలిన ఒయాసిస్సు...

"అమ్మా... ఒక్కసారి పెట్టుకోవా"

"పెట్టుకుంటానమ్మా... తప్పకుండా పెట్టుకుంటాను. ఏదీ ఇలా ఇవ్వు" కంఠం వణుకుతుండగా అంది అమ్మ.

గౌరి కళ్ళజోడు అందించింది.

అత్యంత అపురూపంగా అందుకొంది అమ్మ...

గౌరి చేతిలో బుడ్డీవత్తి పెద్దదౌతూంది...

కళ్ళజోడును జాగ్రత్తగా తగిలించుకుంది అమ్మ మనక వెల్తుర్లో అమ్మను ఆ కళ్ళజోడులో చూసుకున్న గౌరి కళ్ళలోని జలపాతం "అమ్మ"కు 'కనిపించలేదు...'

ఆ దృశ్యం... ఆ సమయంలో... ఎవరికైనా కంటబడితే వారి జీవితంలో మరపురాని హాస్యాన్ని చిందించవచ్చు...

బొమ్మ కళ్ళజోడులో 'అమ్మ' అలానే నిలబడింది.

"చాలా బాగుంటుందమ్మా... నీకు కళ్ళజోడు ఉంటే కలెక్టరమ్మలా ఉంటావ్..." అమ్మ మొఖం దగ్గరకు బుద్ది చేర్చి అంది గౌరి... చీకటి ఆవరించింది. గౌరి నిద్రలోకి జారిపోయింది. అప్పుడు మెల్లగా ఆ కళ్ళజోడును తీసి... ఆ చీకట్లోనే ఓసారి తడువుకొని... అత్యంత ఉద్వేగంతో తన హృదయానికి హత్తుకొంది అమ్మ.

* * *